# కూతురు పెళ్ళి

**కూ**తురుపెళ్ళి కావాలి! పెళ్ళి కావాలంటే ఎంతో కట్నం కావాలి! ఎంత కట్నానికయినా రాఘవయ్య రాజమ్మలు బీదవాళ్ళు. అయిదేళ్ళకిందట పెళ్ళి కావలసిన కూతురు యింకా అట్టానే వుంది! వూళ్ళో అందరూ అదే అంటున్నారు. ఓరి భగవంతుడా!

అప్పటికీ కూతురు పెళ్ళి విషయమై రాఘవయ్య చెవులో పిండిమర పని చేస్తున్నట్టు పనిచేస్తూనే వుంది రాజమ్మ. రాజమ్మకు కూతురు దొడ్లో తోటకూర మొక్క పెరిగినట్టుగా పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది. ఏదోవిధంగా ఎందరికో పెళ్ళిళ్లవుతున్నయి – మరి దీనికి కాదేం?

కూతురు కుందేలుపిల్లకుమల్లే యింటో తిరుగుతున్నది – బెదురుచూపుల్తో.

* * *

"అయ్యో అదేంటండీ పిల్లవాడు నిక్షేపంగా వుంటేనూ!"

"చూస్తే ప్రయోజకుడల్లేనే వుంది! చూడంగానే అమ్మాయిని చేసుకుంటానన్నాడు!"

"బియ్యే చదువుకున్నాట్ట!"

"యీ జీవితానికి యిదొక గండం తప్పింది కట్నం లేకుండా!"

"దానికా అదృష్టరేఖ వుందిగాని పదివేలిచ్చినా దొరకదీ సంబంధం!"

"చిన్నవాడే!"

"అబ్బే మొన్న ఫాల్గుణ మాసానికి పాతిక నిండినయిటండీ!"

"అబ్బే మరీ అంతగాదుగానీ–ముప్పయ్యన్నా వుండచ్చు."

"మీదంతా మరీ విచిత్రం... వాళ్ళకేం ఖర్మపట్టిందీ అబద్ధం చెప్పటానికీ? రైలు ప్రయాణంకాదూ పాపం– కొంచెం నలిగినట్టుంది."

"అంతేగావాల్ను గానీ–మరి కొంచెం నల్లటివాడే."

"ఆc, అందం కోసుకుతింటారా ఏం మరీ మీరంతా – మీరు మహా పచ్చటివారు

– నాకు గడవలేదా ఏం?"

"సరే నీ సుఖం నేనేం ఎరుగుదును. మొదట్లో నువు ఏడ్చావుట్లే నాకు తరువాత తెలిసింది."

"ఛీ పాడూ– చిన్నతనం– అప్పుడేమనిపించిందో! మా చక్కగా వుంటుంది అలవాటు పడ్తే."

"రంగు సంగతంత ముఖ్యం కాదనుకో– కాస్త ఏవో బైటతిరగటాలు వున్నయ్యని విన్నాను– నిజా నిజాలు మనకేం తెలియదనుకో!"

"ఇదిగో యిట్టా నోరుపడేసుకు చస్తారు కాస్త మంచి సంబంధం దొరికిందంటే! అయినా ఆ మొదట చేసుకున్న పెళ్లాం పిచ్చిముండై చస్తే యీడొచ్చిన మొగవాళ్లేం మడిగట్టుకుంటారా ఏమిటండీ. ఛీ పాడు, లేనిపోని పాపం మనం అంటగట్టటం దేనికి నిక్షేపంలాంటి పిల్లవాణ్ణి కాస్తా పట్టుకుని!"

"ఇంతకూ ఎవరి అదృష్టాన్ని గురించీ మన మిప్పుడేం నిర్ణయించలేం అనుకో– అయినా నాకూ ఒక పదివేల కట్నం యివ్వగల తాహతుంటే– ఆ పద్ధతే వేరు."

"అయ్యో అయ్యో యిరవైవేల ఆస్తిపరుడు – కళ్ళుమూసుకుని పదిహేను వేలిచ్చి ఎగరేసుకెళ్తారు! ఏదో వరప్రసాదంలాగా మనింటి ముందరకొచ్చి అడుగుతున్నాడు– ఎంత బుద్ధిమంతుడు– యింతలోనే మర్చిపోయినార్టండీ యీ అయిదేళ్ళ నుంచీ మనం తలకాయ దాచుకున్న దాచుకోటం– యీ దరిద్రంలో– అబ్బ ఎంత అదృష్టం, ఎంత అదృష్టం!"

"కాదుటే మరీ– నా తల తాకట్టుపెట్టినా ఒక్క దమ్మిడీ అంటే ఒక్క దమ్మిడీ యిచ్చే జీవిలేదు యీ ప్రపంచంలో."

"మరి అదిగాదూ నేను మొత్తుకునేదీ!"

"పాపం చిన్న ముండ అదేం అనుకుంటున్నదో!"

"బానేవుంది! పెళ్ళంటే ఎవరికన్నా యిష్టంగానే వుంటుంది–మాచక్కా–"

"పాపం యీ నాలుగయిదేళ్ళనుంచీ మన కీచులాటలో దానికి పెళ్లికాదని భయం కలుగజేశాం గదా!"

"దానికేం లేవా భయాలు– మీకున్నట్టుంది అటే చూస్తే."

"నా కెందుకేవ్ భయం– యింతకూ దాని పెళ్ళిగదా అనిగాని–"

"దాని పెళ్ళి కాబోతే యిహ మీ పెళ్ళీ నా పెళ్ళీనా ఏమిటి యిదంతా! ఏదో యింత లోకానుభవం వుందిగనుక యిట్టా ఏడుస్తాంగాని-చిన్న కుంక దానికేందెల్సు అభం శుభం!"

"పందొమ్మిదేళ్లున్నయిగానీ- చివర కంతేలే-"

"అనుభవాల్లేంది ఎప్పుడూ అంతే."

"అవునుగానీ- మన పెళ్ళప్పుడు నువేమనుకున్నావే?"

"మీకేమన్నా పుట్టిందా ఏం- చాల్లెండి సరసం."

"వుహుఁ మన్లోమాట- ఎందుకో అనిపించిందిలేవే- నేనెట్టా కనుపించాను నీకూ?"

"ఛీ పాడూ-"

"ఛీ పాడూ! ఎన్నేళ్లయినాక అడుగుతున్నానే?"

"వూఁ- పోనిద్దురూ-"

"ఇదిగో యింతే కాదూ-"

"అప్పుడెందుకో మీరు- డోకొచ్చారండీ-"

"చా-!"

"అదేమిటో - అట్టా అనిపించిందండీ-"

"మరెందుకు చేసుకున్నావే?"

"మా అమ్మమ్మ చంపుతానంది- బావిలోపడి చస్తానంది వెధవ- పాపం ఎక్కడుందో చచ్చి!"

"పెద్దముండల్తో అదే చావు-"

"అసలు మా అమ్మమ్మ సంగతి నీకు తెలియదుగానీ- వుత్త పాచిముండ- ఛీ పాపం పెద్దముండ!"

"అయితే నువు నన్ను బలవంతాన చేసుకున్నావన్న మాట!"

"అబ్బే అవేం మాటలండీ- నేను తరవాత ఒప్పుకున్నాగా."

"అదే బలవంతమ్మీద-?"

"ఛా ఛా!"

"మరి చేసుకోనని ఏడ్చావుటగాదుటే?"

"చిన్నతనం కాదుటండీ- అలవాటయినాక అంతా బాగానే వుంది- అబ్బ పోనిద్దురూ!"

"నువు భలే దొంగవే!"

"చాల్లే వూరుకోండి - సరసం బాగానే వుంది!"

"నిజంగా పెళ్ళంటే మాటలా!"

"ఎంతో అదృష్టం వుండాలి - మరి మీకీ సంబంధం నచ్చిందండీ?"

"నీకో?"

"చాల్లెండి మరీ- నాకు భలే నచ్చిందండీ."

"నాకూ అంతే - తథాస్తు."

**(ఆంధ్రజ్యోతి మాసపత్రికలో)**